క్లుప్తంగా

14న అక్షరాభ్యాసం

మణుగూరురూరల్: ఈ నెల 14వ తేదీన మండలంలోని అశోక్‌నగర్ షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వరస్వామి వారి మండపంలో మండల సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక ఉచిత అక్షరభ్యాస మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యుడు, పురోహితుడు విస్సావఝ్జల శేషగిరిశర్మ ఆదివారం తెలిపారు. 14న ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు అక్షరభ్యాస మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్షరభ్యాసం కోసం పూజా సామగ్రి, పలక, బలపం సమితి వారే ఉచితంగా అందిస్తారని తెలిపారు.

ఠాణాలోకి దూసుకెళ్లిన డీసీఎం వ్యాన్

అశ్వారావుపేటరూరల్: ఓ డీసీఎం వ్యాన్ పోలీస్ స్టేషన్‌లోకి దూసుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని ఊట్లపల్లి వైపు నుంచి అశ్వారావుపేటకు వస్తున్న డీసీఎం వ్యాన్ అదుపుతప్పి స్టేషన్ గేటును ఢీ కొని లోపలకు దూసుకెళ్లింది. వ్యాన్ డ్రైవర్ మద్యం తాగి వాహనం నడిపాడు. గమనించిన స్థానికులు వ్యాన్‌ను అడ్డుకునేలోపే ఈ ప్రమాదం జరిగింది. అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

15 నుంచి యోగా శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎస్ఆర్ కాలనీలో శ్రీ వెంకటేశ్వర ఆలయంలో భద్రాద్రి యోగ ఆరోగ్య మిషన్, శ్రీవెంకటేశ్వర సాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు యోగ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నరేష్ గురుజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 6.30 వరకు సాయంత్రం 7 నుంచి 8 వరకు హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు.

బియ్యం అందజేత

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లోని శ్రీవిద్యాభ్యాస(బాలవెలుగు) పాఠశాలకు మణుగూరు ఓసీ గనిలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ దాసరి రజిని తన తల్లి సరోజిని జ్ఞాపకార్థంగా ఆదివారం 50కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు సహ పంక్తి భోజనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్‌డి.నాసర్‌పాషా, మచ్చ శ్రీనివాస్, చొప్పరి శ్రీలేఖ, బత్తుల జ్యోతి, ఆరే దివ్య, మంగిలాల్, సుహాసినిదేవి, రాధ తదితరులు పాల్గొన్నారు

మియా జానీ వర్ధంతి సభ

అశ్వారావుపేటరూరల్: స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్‌డి.మియా జానీ 15వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా మాట్లాడుతూ.. అశ్వారావుపేట ప్రాంతంలో భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి, పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడిన మియా జానీ నేటి తరానికి ఆదర్శమని అన్నారు. పార్టీ నాయకులు ఎస్‌కె.సలీం, యార్లగడ్డ భాస్కర్, గన్నిన రామకృష్ణ, సత్యవతి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు

అశ్వాపురం: సద్గురు సంత్ సేవాలాల్ 285వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని సంతు సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం బంజారా యువకులకు మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతగా కల్యాణపురం జట్టు, రన్నరప్‌గా అశ్వాపురం చిన్నతండా జట్టు నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ.5,016, షీల్డ్, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.3,016, షీల్డ్‌లను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, అజ్మీరా కోటి నాయక్, బూక్యా నరసింహానాయక్, పీఈటీ వీరన్న, బానోత్ హనుమనాయక్, క్రీడాకారులు, సేవాలాల్ సేన నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

అశ్వాపురం: విద్యార్థి దశలో కీలకమైన మలుపు పదో తరగతి అని, విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని బీసీ హాస్టల్ వార్డెన్ నరసింహారావు అన్నారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వార్డెన్ నరసింహారావు సొంత ఖర్చులతో ఆల్ ఇన్ వన్ పుస్తకాలను హాస్టల్ విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు హాస్టల్ వార్డెన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక నిధులు కేటాయించాలి

భద్రాచలంటౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ డైట్ బిల్లులను వెంటనే విడుదల చేసి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగేల శివ ప్రశాంత్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 7.75 శాతం నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ పట్టణంలో ఆదివారం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శివ ప్రశాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో పవన్, సాయికృష్ణ, అశోక్, కార్తీక్, అఖిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అదుపులేని అప్‌డేట్ కష్టాలు

- మండలంలో ఆధార్ సెంటర్ల లేమి
- మార్పులు, చేర్పుల కోసం బయటి కేంద్రాలకు పరుగులు
- తిండితిప్పలు మాని గంటలకొద్దీ పడిగాపులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


మణుగూరులోని ఓ ఆధార్ సెంటర్ వద్ద రద్దీ


ఆధార్ సెంటర్ తెరవకముందే కవర్లను వరుసలో ఉంచుకున్న జనాలు

కరకగూడెం: మండలంలోని ప్రజలకు ఆధార్ తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి కావడంతో మండలవాసులు ఆధార్ నమోదు కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. కోడి కూతకంటే ముందే లేచి ఆధార్, మీసేవ కేంద్రాల వద్ద సిబ్బంది కోసం కాపు కాస్తున్నారు. ఫోన్ నంబర్ జత చేయాలని ఒకరు, తమ కార్డులో పేర్లను మార్పులు చేయాలని మరొకరు, చిరునామాలు మార్చాలని ఇంకొకరు ఇలా రకరకాల అవసరాల కోసం వస్తున్న జనంతో ఆధార్ నమోదు కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.

పేదలలకు రేషన్ సరుకులు అందాలన్నా.. విద్యార్థులకు ఉపకారవేతనాలు కావాలన్నా.. పింఛను పొందాలన్నా.. బ్యాంకుల్లో ఖాతా తెరవాలన్నా నేటి రోజుల్లో ఆధార్ కార్డు అప్డేట్ తప్పనిసరిగా మారింది. పదేళ్ల క్రితం ఆధార్ కార్డులు పొందినవారు అప్డేట్ చేసుకోవాలని యూఐడీఏ నుంచి సందేశాలు రావడంతో ఈ ప్రక్రియకు తీవ్ర అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఒక్కో కేంద్రంలో సుమారు 40 నుంచి 50 టోకెన్లు మాత్రమే జారీ చేస్తున్నారు. కాగా మండలంలో ఆధార్ సెంటర్ లేక మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజాము నుంచే పినపాక, మణుగూరు మండలాల ఆధార్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. తిండీతిప్పలు మాని గంటలకొద్దీ అక్కడే పడిగాపులు కాస్తున్నారు. స్థానిక మీసేవ, ఇతరత్ర నెట్ సెంటర్లలో ఆధార్ కార్డుకు సంబంధించి పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులో లేవు. తద్వారా బయటి ప్రాంతాలకు ప్రజలు వెళ్లక తప్పడం లేదు.

పథకాల కోసం పరుగులు

ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణానికి ఆధార్ కార్డుతో ప్రభుత్వం ఇప్పటికే లింకు పెట్టిన విషయం తెలిసిందే. ఉచిత ప్రయాణానికి ఖచ్చితంగా ఆధార్ కార్డు ఒరిజినల్ కండక్టరుకు చూపాల్సిందేనని నిబంధన పెట్టారు. దీనికి తోడు ఇందిరమ్మ ఇళ్ల వంటి మిగతా పథకాలకూ ఆధార్, రెసిడెన్స్‌ను తప్పనిసరి చేశారు. ఇక్కడే ఆశావహులకు కొత్త చిక్కొచ్చి పడింది. ఇప్పటివరకు చాలామందికి ఆధార్లో నివాసం ఒకచోట, చిరునామా మరో చోట ఉన్నా పట్టించుకోలేదు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని ఆంధ్ర మహిళలు ఆధార్ కార్డుపై తెలంగాణ ప్రాంత భర్త ఇంటి చిరునామాగా మార్చుకోలేదు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం మొదలు అన్ని పథకాలు అందుకునేందుకు అనర్హులమయ్యే ప్రమాదం ఉందని ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. తెలంగాణలోనూ చాలా కుటుంబాల్లో మహిళలు ఇంటి చిరునామా మార్చుకోలేదు. తాజాగా ఆధార్ కార్డునే ప్రామాణికంగా చెబుతుండటంతో తమను అనర్హులుగా ప్రకటించకుండా చాలామంది ముందస్తు జాగ్రత్త పడు తున్నారు. ఆధార్ కార్డుపై చిరునామా మార్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు ఇందిరమ్మ ఇంటి కోసం మహిళ పేరుతో ఇంటి స్థలం చూపాలన్న నిబంధనతో పథకాల్లో అర్హత ధ్రువీకరణ కోసం గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల వైపు జనం పరుగులు తీస్తున్నారు. వీటన్నింటికీ ఆధార్ కార్డు అప్డేట్ కావాల్సిన తరుణంలో ఆధార్ సెంటర్ల వద్ద రద్దీ తీవ్రస్థాయిలో పెరిగింది. ఇప్పటికైనా పాలకులు,అధికారులు తక్షణమే స్పందించి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

గంటల కొద్దీ ఇబ్బందులు



నేను, నా కూతురు మణుగూరు వెళ్లి గంటల కొద్దీ లైన్లో నిల్చొని తీవ్ర ఇబ్బందులు పడి ఆధార్ అప్డేట్ చేసుకున్నాం. మాతో పాటు చాలా మందికి రెండు రోజులు తిరిగితే గానీ నిర్వాహకులు టోకెన్ ఇవ్వలేదు. ఆధార్ అప్డేట్,మార్పులు చేర్పులకు సంబంధించి విపరీతంగా జనాలు ఇక్కడికి వస్తున్నారు.

– మల్ల రమణ, కరకగూడెం

పనులు మానుకొని పడిగాపులు



మండలంలో ఆధార్ సెంటర్ లేక పోవడంతో మేము చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆధార్ అప్డేట్ కోసం చంటి పిల్లతో ఉదయాన్నే వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. తీరా అక్కడికి వెళ్తే చాలా సందర్భాల్లో టోకెన్స్ అయిపోయాయి. మళ్లీ రండి అని చెప్పడంతో మరలా పనులు మానుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– గోగు కోటేశ్వరరావు, రేగుళ్ల

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి



రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న కరకగూడెంలో ఆధార్ సెంటర్ లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నింటికీ ఆధార్ అవసరం కాబట్టి అధికారులు, పాలకులు తక్షణమే మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి. అధికారుల పట్టింపులేని తనంతోనే ఆధార్ సెంటర్ ఏర్పాటులో జాప్యం జరుగుతోంది.

– సిరిశెట్టి కమలాకర్, కరకగూడెం

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

పినపాక: పంచాయతీల అభివృద్ధికి కృషిచేసి ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ పవన్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పంచాయతీలను పరిశీలించారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. పంచాయతీల్లో మురుగు లేకుండా చూడాలని, తప్పనిసరిగా బ్లీచింగ్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ ఇరిగేషన్ ఏఈ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.


పంచాయతీల్లో పనులను పరిశీలిస్తున్న డీఎల్పీఓ పవన్ కుమార్

గ్రూప్-4లో సత్తా

దమ్మపేట: టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన గ్రూప్ 4 ఫలితాల్లో మండలానికి చెందిన గిరిజన యువతి సత్తా చాటింది. మండలంలోని గట్టుగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతి నల్లబోతుల అనూష గ్రూప్ ఫోర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి జనరల్ విభాగంలో 2,228వ ర్యాంకు సాధించింది. మెరిట్ లిస్ట్‌లో చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా అనూషను ఆదివాసీ సంఘాల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందించారు.

నేడు కంటి వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డు ఉన్న ఆల్ పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 12న ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

బదిలీ తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ అనంత రామకృష్ణను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

చర్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హన్మకొండ జిల్లాకు బదిలీ అయిన చర్ల తహసీల్దార్ అనంత రామకృష్ణను ఇక్కడి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయగా.. సిబ్బంది జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అనంత రామకృష్ణ మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్ల కాలంలో తనకు సహకారం అందించిన కార్యాలయ అధికారులు, సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. కాగా, ఆయన స్థానంలో నూతన తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ జి.నర్సింహారావు, సిబ్బంది బి.నాగేశ్వరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం గ్రామ పంచాయతీలో ఆదివారం పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎంపీపీ ముత్తినేని సుజాత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, గొల్లగూడెం మాజీ సర్పంచ్ పొడియం అనిల్, కాంగ్రెస్ నాయకుడు బొబ్బాల నాగేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను నియంత్రించాలి

భద్రాచలంటౌన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి పుణ్యక్షేత్రంలో బెల్ట్ షాపులను నియంత్రించాలని టీటీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అజీం అన్నారు. పట్టణంలోని రాఘవ నిలయం(రెడ్డి సత్రం)లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భద్రాచలం పట్టణంలో సుమారు 300 బెల్ట్ షాపులు ఉన్నాయని, నిత్యం భక్తులతో రద్దీగా ఉండే పుణ్యక్షేత్రంలో బెల్ట్ షాపులను తీయించాలని అన్నారు. నెల రోజుల క్రితం స్థానిక ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేసినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రామాలయం చుట్టూ, పాఠశాల వద్ద బెల్ట్ షాపుల ఉండడంతో భక్తులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎక్సైజ్ మంత్రిని కలిసి సమస్యను వివరిస్తానని అన్నారు.

కోత పండుగ వేడుకలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్‌లోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రైస్తవుల కోత (ప్రథమ ఫలాలు) పండుగ వేడుకలను ఘనంగా జరిపారు. ముందుగా కోత పండుగ నేపథ్యంలో క్రైస్తవులు తమ పంట పొలాల్లో కాసిన ప్రథమ పంట ఫలాలను దేవుడికి సమర్పించారు. అనంతరం చర్చి పాస్టర్, డాక్టర్ రెవరెండ్ సుధాకర్‌తోపాటు మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దలు నంద్రు రమేష్, నెహ్రూ, విశ్వాసులు పాల్గొన్నారు.

బియ్యం, పండ్లు వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం గ్రామం వద్ద ఉన్న అరీఫా-రోష్ని వృద్ధాశ్రమంలో ఐకేపీ ఏపీఎం.సత్యనారాయణ కుటుంబ సభ్యులు తమ కుమారుడు దివంగత శ్రీరాందీక్షిత్ జన్మదినం సందర్భంగా ఆదివారం 25 కేజీల బియ్యం, పాలు, పండ్లు వితరణగా అందజేశారు.

వరుడికి ఎమ్మెల్యే ఆశీర్వాదం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన జాలె రామకృష్ణారెడ్డి, తిప్పారెడ్డి నారాయణరెడ్డిల మనవడు చరిత్‌రెడ్డి వివాహం సందర్భంగా ఆదివారం మొండికుంటలోని వారి నివాసంలో వనపర్తి ఎమ్మెల్యే మెఘారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు చరిత్‌రెడ్డిని ఆశీర్వదించారు. ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు పాల్గొన్నారు.

నూతన బస్సులు ప్రారంభం

మణుగూరుటౌన్: పట్టణంలోని సురక్షా బస్టాండ్ వద్ద రెండు స్లీపర్ కోచ్ నూతన ఆర్టీసీ బస్సులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డీఎం స్వామితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు నిత్యం సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు జరిపే ప్రజల సౌకర్యార్థం రెండు నూతన స్లీపర్ క్లాసులు మంజూరు చేశారని తెలిపారు. మణుగూరు డిపోకు తొలిసారి స్లీపర్ కోచ్ బస్సులను అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బస్సులను పచ్చ జెండా ఊపి ప్రారంభించి బస్సులో కొద్ది దూరం ప్రజలతో కలిసి ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు, వివిధ మండలాల అధ్యక్షులు పీరినాకి నవీన్, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, శివ, కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల శంకర్, సామా శ్రీనివాసరెడ్డి, బానోత్ లక్ష్మణ్, నియోజకవర్గ యువజన నాయకుడు కొర్సా ఆనంద్, గాండ్ల సురేశ్, వీరంకి వెంకట్రావ్ గౌడ్, ఆర్టీసీ సీఐ కనకదుర్గ, ఎంఎఫ్ శ్రీనివాస్ చింతల కృష్ణ, సూర రాజు, ఆదిలక్ష్మి, మానస, ఆర్‌కె.రాము, ప్రశాంత్, శ్రీధర్, తదితరులు ఉన్నారు.


నూతన స్లీపర్ కోచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

సమ్మెను జయప్రదం చేయండి

భద్రాచలంఅర్బన్: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సరళ నరేష్, టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.అజీమ్ కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాలతో పాటు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ, ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ముస్లింమైనార్టీ సామాజిక సంఘాలు హోటల్ ఓనర్స్ అసోసియేషన్, ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు, సరెళ్ళ నరేష్, ఎస్.కె అజీమ్‌లు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా ఈ నెల 16న భారత్ బంద్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా సంఘాలు, పార్టీల నాయకులు శివాజీ, శివ ప్రశాంత్, మునాఫ్ మస్తాన్, గాదే మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, జిందా, అల్లాడి పౌలరాజు, దాసరి శేఖర్, వైవి.రామారావు, డి.సీతాలక్ష్మి, యన్.లీలావతి, కుంజ శ్రీను, అప్పారి రాము పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: మట్లాడుతున్న సీపీఎం నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు

అన్నపురెడ్డిపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తారీకు తలపెట్టిన భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని జానకీపురం గ్రామంలో ఆదివారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు, రైతుల హక్కుల కోసం తలపెట్టిన భారత్ బంద్ విజయవంతం చేయాలన్నారు. జిల్లా కన్వీనర్ కొండపల్లి శ్రీధర్, సీఐటీయూ నాయకులు లిక్కి బాలరాజు, జంగిలి వెంకటరత్నం, కోటయ్య, లక్ష్మి, సామ్రాజ్యం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులతోనే సేవలు సాధ్యం


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్

అశ్వారావుపేటరూరల్: మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లోని వలస ఆవాసల్లో వైద్య సేవలు అందించడం గ్రామీణ వైద్యులతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జూపల్లి రమేష్ అన్నారు. ఆదివారం అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సమావేశం జరిగింది. మొదట ఆ సంఘం క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులు తమ పరిధి దాటి వైద్యం చేసి ఇబ్బందుల్లో పడొద్దని సూచించారు. గ్రామీణ వైద్య వ్యవస్థ లేకపోతే నేటికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందక అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ..ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులకు ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ధ్రువీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ ఎంజి.శంకరరావు, టి.కృష్ణ, తాతారావు, పి.సత్యనారాయణ, ఎస్‌కె.వలీ, వి.సత్యనారాయణ, ఎస్.చంద్రశేఖర్, కె.వెంకటేష్, మోహన్, గోవిందరాజులు, రఫీ, భగవాన్ పాల్గొన్నారు.

మార్చి 11 నుంచి బ్రహ్మోత్సవాలు


మణుగూరుటౌన్: మార్చి 11 నుంచి 14వ తేదీ వరకు పీవీకాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ ఆదివారం తీర్మాణించింది. కార్మిక సంఘాలతో ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సమావేశానికి పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సింగరేణి ఉద్యోగుల, స్వామి భక్తుల సహకారంతో ప్రతీ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. సింగరేణి కార్మికుల భక్తుల సహకారం కోసం విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు వై. రాంగోపాల్, డాక్టర్ శేషగిరిరావు, భోగ రాజలింగు, వీరభద్రయ్య, వెంకటరత్నం, నాజర్‌పాషా, ఆలయ కమిటీ కోశాధికారి సీతారామిరెడ్డి అర్చకులు దామోదర చార్యులు తదితరులు ఉన్నారు.


ఆలయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతిగౌడ్

వాసవీ ఆత్మార్పణ దినోత్సవం

దమ్మపేట: మండల కేంద్రంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దమ్మపేటలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న వాసవీ మాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కలశాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రదక్షిణలు చేశారు. వాసవీ మాత, అమ్మవారిలో ఐక్యం అయిన పర్వదినం సందర్భంగా వేద పండితుల సమక్షంలో మహిళలు కుంకుమ పూజలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన సంతర్పణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మణుగూరుటౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం మణుగూరు వాసవీ క్లబ్, వాసవీ వనితా వైభవం ఆధ్వర్యంలో గుట్టమల్లారంలోని వాసవీ మాత ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. వాసవీ కన్యకాపరమేశ్వరి ఔనత్యాన్ని వివరించారు. ఆలయ పూజారులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ దోసపాటి వెంకటేశ్వర్లు, ఇంటర్ నేషనల్ ప్రొగ్రాం కోఆర్డినేటర్ బండారు నర్సింహారావు, వాసవీ క్లబ్, వనితా వైభవం ప్రతినిధులు బొగ్గవరకు అంజలి, తమ్మిశెట్టి వసుధ, పాలవాయి వసుంధర, కేసా రాజేంద్ర ప్రసాద్, శ్యామ్, చలపాటి నాగరాజు, జోన్ చైర్మన్ శేషుబాబు, చిత్తలూరి రమేశ్, కత్తిరాము, ఉమ, నాగరత్నమణి, వడియాల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.


దమ్మపేట: వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయ ట్రస్ట్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవమును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున నగర సంకీర్తన, పంచామృతాభిషేకం, హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలపు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పచ్చిపులుసు వెంకటసుబ్బారావు, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, నాగభూషణం, పుల్లారావు, వినోద్, శ్రీనివాసమూర్తి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంటౌన్: ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అశ్వారావుపేటరూరల్: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని వైభంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు చేసి, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలకంరణ చేసి, నూతన వస్త్రాలంకరణ చేశారు. ఆ తర్వాత నగర సంకీర్తనలో భాగంగా కలశాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక హారతులు, కుంకుమ పూజలు చేసి, వేద పండితుల సమక్షంలో హోమాలు జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని సారెను సమర్పించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేలా ఆశీర్వచనలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.